# పట్నం ప్రయాణం

మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో రైలు ఆగుతూండగానే లోపల కూర్చున్న శీతారామయ్యకు చెమట్లుపోసినై. చిరకాలంగా మద్రాసు చూడాలన్న శీతారామయ్య కోర్కె ఫలించింది. పిల్లవాడి మొక్కు చెల్లించుకునేందుగ్గాను, శీతారామయ్య కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళి, ఏడుకొండలవాడి దర్శనం చేసుకొని మొక్కుబడులు చెల్లించుకొని, యింతదూరం వచ్చాక అడుగులో వున్న మద్రాసుని చూడకుండా ఏలా పోవటమా అని ఆలోచించిన శీతారామయ్య తల్లినీ, భార్యనూ, కొడుకునూ వెంటేసుకొని గూడూరు మీదుగా మద్రాసు వచ్చాడు.

శీతారామయ్య యువకుడైనా పాతకాలం మనిషి. అతనికి మద్రాసు చూడాలన్న కోర్కె యీనాడు కలిగింది కాదు. చిన్నప్పుడు మద్రాసు చూసొచ్చిన శంకరయ్య మాటలు విన్నప్పుడే అతనికి కలిగింది మద్రాసు చూడాలనే కోరిక. శంకరయ్య బతికిన కాలేజీ, చచ్చిన కాలేజీ, చైనా బజారును గురించి చిత్రవిచిత్రంగా ఈనాటికి చెప్తుంటాడు. అది వింటూన్నంత సేపూ శీతారామయ్య "దీం తస్సా చెక్కా! అదెప్పుడైనా సూడాల్సిందేనహా !" అనుకొనేవాడు మనసులో. ఆర్థిక కారణాలూ, యితరత్రా కాలం కలిసిరాకపోవడంవల్లా మనసులోని కోరిక మనసులోనే వుండిపోయింది.

శీతారామయ్య మూడుముళ్ళు వేసుకొన్న మరుసటి సంవత్సరంలోనే ఓనలుసు కలగడమూ, వాడికి పుట్టెంట్రుకలు తిరుపతి ఏడుకొండల స్వామికే యివ్వాలని అటు పెళ్ళాంతరఫు వాళ్ళు యిటు తనవాళ్ళు మొండికేసుక్కూచోడంవల్లనూ శీతారామయ్యకు తిరుపతియాత్ర చేయక తప్పిందికాదు. వారం రోజుల్లో తిరుపతి వెళ్ళాలనుకొంటూన్న సమయంలో వాళ్ళ ఊళ్ళో ఓ చిన్న గమ్మత్తు జరిగింది.

మీ రాష్ట్రం మీకిస్తామంటూ ప్రధాని చేసిన ప్రకటన పురస్కరించుకొని తెలుగు జిల్లాలలో పరిస్థితులు దర్యాప్తు చేయటానికి వచ్చిన అధికారి సరిగ్గా వాళ్ళూరే రావడం జరిగింది. ఆ రోజున జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శనలో ముఖ్యంగా శీతారామయ్యను ఆకర్షించింది 'మద్రాసు మనదే' సంఘం వాళ్ళు చేసిన హడావుడి! "మద్రాసులోనే మా—" అని రాసి వున్న అట్ట మోసుకొని శీతారామయ్య ఆయనగారి కారు కడ్డంగా పరుగెత్తికెళ్ళి ఓ పొలికేక పెట్టాడు "మద్రాసు మాదే" నని. శీతారామయ్యకు ఆరోజున శివమెత్తిపోయిందంటే నమ్మండి. ఆయన చేసిన ఆర్భాటం యింతా అంతా కాదంటే నమ్మండి.

అప్పటినుండీ మద్రాసు ఎప్పుడెప్పుడు పోదామా అని వుబలాట పడిపోయాడు. సరే పనిలోపని కలిసొచ్చిందని ముసలితల్లినీ, పెళ్ళాన్నీ, కొడుకునీ తీసుకొని తిరుపతిబం డెక్కేశాడు.

తిరుపతి కొండలమీద మొక్కుబడులు తీర్చుకొని గూడూరువచ్చి మద్రాసు బండిలో — అదీ యక్స్ప్రెస్‌లో నానావస్థాపడి ఎక్కింది శీతారామయ్య కుటుంబం.

బండి మద్రాసు స్టేషన్‌లో ఆగే ఆక్కముందే శీతారామయ్య కిటికీగుండా బయటికి దూకేశాడు. అలా దూకడం అతనికి వాళ్ళ స్టేషన్‌లో అలవాటుమరి! వాళ్ళ స్టేషన్‌లో యక్స్‌ప్రెస్ రెండు నిమిషాలకంటె ఎక్కువ ఆగదుగా!!

భార్య అచ్చమ్మ చంకలోవున్న పిల్లాడ్ని భర్త కందించి తనూదిగింది. ప్లాట్‌ఫారంపై తిరుగుతూన్న రకరకాల మనుషుల్ని బెదురు బెదురుగా చూస్తూ నుంచోంది. శీతారామయ్య ముసలమ్మను దించుకొనేలోపల కూలీలు తలో సామానూ పట్టుకొని నుంచొన్నారు.

కూలీల దగ్గర్నుంచి సామాను గుంజుకొనేసరికి శీతారామయ్యకు తలప్రాణం తోక్కొచ్చింది. అయినా కూలీలు వాళ్ళచుట్టూమూగి తమాషాగా మాట్లాడడం మొదలెట్టారు.

అందులో ఒకడు అచ్చమ్మ చేతిలోవున్న పచ్చడిజాడీ లాక్కుని "వామ్మా! పోదాం!" అన్నాడు.

శీతారామయ్యకు అది చూసేసరికి అరికాలిమంట నెత్తికొచ్చింది. శంకరయ్య చెప్పిన మాటలు గుర్తునైన్ని. దడిస్తే లాభంలేదని కూలీమీదకు ఒక్క దూకుదూకి, వాడి చేతిలో వున్న జాడీ లాక్కోబోయాడు. వాడు విసురుగా అదె కిృంద పడేసి "మొట్టైగళకు ఎన్నాదుకుడా కూలీ!" అంటూ వెళ్ళి పోయాడు.

"అయ్యో నాజాడీ" అంటూ ముసలమ్మ కేకేసింది. అచ్చమ్మ అయోమయంగా మొగుడికేసి చూసింది. శీతారామయ్య కళ్ళెర్రచేసుకొని పళ్ళు కొరుక్కున్నాడు. పాపం అంతకన్నా చేయగలిగిందేమీ లేదు. అదే వాళ్ళూళ్ళో అయితే వాోసి గొయ్య తిరగేసి దబదబా నాలుగుబాదేసి వుండేవాడు వాడ్ని.

ప్లాట్‌ఫారంమీద తిరుగుతూన్న జనం వాళ్ళదగ్గరకు రాగానే ఓ క్షణం ఆగి అదోమాదిరిగా చూసి నవ్వుపోతున్నారు. దానిక్కారణం వాళ్ళు తిరుపతి దేముడికి మొక్కుబళ్ళు చెల్లించుకు రావటమే! ఆ సంగతి పెళ్ళాం నున్నటితల చూసే దాకా శీతారామయ్యకు అర్థంకాలేదు. స్టేషన్‌లో దిగిన గాభరాలో అచ్చమ్మ నెత్తిమీదకు చెంగు లాక్కోటం మరిచిపోయినట్టుంది.

“ఓసేయ్ బోడీ! తలమీద గుడ్డేసుకోయె!” ఎక్కడో కారం రాసుకొన్నట్టుగా అన్నాడు శీతారామయ్య,

అచ్చమ్మ, మొగుడుతలకేసి చూసి సినీతారలా నవ్వబోయింది! ఏదో చప్పున గుర్తొచ్చినవాడిలా పైపంచతీసి తలకు చుట్టుకొన్నాడు మొగడు. ఇదేమీ పట్టనట్టు కుర్రాడు ముసలమ్మ బోడితలమీద గిలక్కాయవేసి కొట్టూ ఆడుకుంటున్నాడు.

ఎలా అయితేనేం శీతారామయ్య కుటుంబం స్టేషన్ దాటి బయటకొచ్చింది.

“కన్నయ్యశెట్టి సత్ర మెక్కడండీ?” దారినే పోతూన్న ఒకాయన్ను అడిగాడు శీతారామయ్య. మొత్తంమీద ఆ వ్యక్తి ఏదో చెప్పాడు. తెలుగ్గానే ఉందిగాని శీతారామయ్యకు అర్థం కాలేదు. పంచ కట్టకొని తెలుగువాళ్ళలా వున్న యిద్దరి వ్యక్తుల్ని చూసేసరికి ప్రాణం లేచొచ్చింది. దగ్గరికిపోయి ఆప్యాయంగా అడిగాడు అదేప్రశ్న.

అందులో ఒకాయన ముఖం చిట్లించుకొని—“ఎగ్మూరు పోవయ్యా!” అన్నాడు. శీతారామయ్య నిరుత్సాహంగా వెనక్కు తిరగ్గానే యిలా వినపడింది.

"వెధవగుంపు! పిల్ల దగ్గర్నుంచి తల్లిదాకా బోడి తల కాయలేసుకొస్తారు. ఆ తగలడేవాళ్లు ముందు మద్రాసువచ్చి తిరుపతి పోగూడదూ ?"

"అదేనండీ, మనలాంటివాళ్ళకు మాట్లాడాలంటేనే అస హ్యమేస్తుంది !"

శీతారామయ్య హృదయానికి వాళ్ళమాటలు ములుకుల్లా నాటినై. తనలో వాళ్ళు అంతగా అసహ్యించుకోవాల్సిం దేముందో అర్థం కాలేదు ఏదో మనవాళ్ళుగదా అని ఆశగా పోతే అంత పరాభవమైంది. నిలబడి మాటకూడా చెప్ప లేదే వీళ్ళు. వాడే నయం మనమాట తెలియకపోయినా నిల బడీ మాటైనా చెప్పాడు, అనుకొంటూ శీతారామయ్య ఎగ్మూరుకు దారితీశాడు.

పట్టణంలో పెద్దబజారులో యివతలనుంచి అవతలకి దాటడం అంటే బలేకష్టమని శంకరయ్య చెప్పిందానివల్ల శీతా రామయ్యకు యిదివరకే తెలుసు. పంచ బిగించికట్టి భార్యను తల్లినీ చెరో చేత్తో పట్టుకొని స్టేషన్‌వైపునుండి హాస్పిటల్ వైపుకు దాట్టానికి తయారయాడు.

రయ్యినవచ్చే కారులూ, పోయే కారులూ, ట్రాంలూ, రిక్షాలూ, అంతా పద్మవ్యూహంలా వుంది. తెగించి శీతా రామయ్య రోడ్డుకు అడ్డం పడ్డాడు. అవతలికి చేరేసరికి ప్రవహిస్తూన్న మృత్యువును దాటినంత పనైంది! అటుపక్క ఓ రెండు ట్రాం బళ్ళూ, యిటు ఓ రెండు బస్సులూ, ఆగడం; అందులో వాళ్ళు శీతారామయ్యకు ఓ నాలుగు పెట్టడం అత నేమీ పట్టించుకొన్నట్టులేదు.

మొదట వాళ్ళన్నదేదో అర్థమయి చస్తేగా?

ముసలమ్మ రోడ్డుమధ్యకు రాగానే నోరు తెరుచుకొని అలాగే పైకి చూసింది.

"అదేందే, పైకి సూస్తావ్? ట్రాంబండొస్తుంటేనూ?"

"అది గాదురా శీతాయ్! ట్రాంబండి తీగమీద నడుసుద్దంటారు గాదురా? మరి భూమ్మీదే పోతుందిగదరా?" అంది ముసలమ్మ ట్రాంలైన్ దాటుతూ.

కన్నయ్యశెట్టి సత్రం చేరటానికి వాళ్ళుపడ్డ అవస్థ మళ్ళీ శీతారామయ్య చెప్పాల్సిందే లేండి!

రెండోరోజు సాయంత్రం స్టూడియోలు చూట్టానికని పెళ్ళాన్ని తీసుకొని బయలుదేరాడు శీతారామయ్య. సినిమాలు తీసేకాడికి పోయి సూడాలని అచ్చమ్మకు చిన్నప్పట్నించీ వుబలాటం.

మొగుడూ పెళ్ళాం ఎక్కడికి పోబోతున్నదీ కనిపెట్టేసిన ముసలమ్మ అంది.

'బాలరాజు యాసంకట్టినోణ్ణి నాకు చూపించరంటరా?'

"ఓసి నీయమ్మ! నీదో తగలాటకం! ఆడకు నువ్వొత్తావే? ఆడకు పోవటం కష్టం! నీకు మూరుమార్కెటు సూపిత్తాలే తిరిగొచ్చాక!" అని ముసలమ్మకు చెప్పి మొగుడూ పెళ్ళాం బయలుదేరారు. దంపతు లిద్దరూ ఎగ్మూర్‌లోవున్న కన్నయ్యశెట్టి సత్రం దగ్గర్నుంచి సరాసరి నడిచొచ్చి పారిస్ కార్నరీలో నంబరు పదిహేడు బస్సు ఎక్కారు.

బస్సు కదలగానే అచ్చమ్మ ఎదురుసీట్లో వున్నాయన వొళ్ళోకి ఎగిరిపడడం, దాంతో ఆయనలేచి మర్యాదగా సీటు యివ్వడమూ జరిగింది. అది చూసేసరికి శీతారామయ్యకు వళ్లు మండిపోయింది! అల్లంత కోపాన్నీ అంగుట్లోనే యిమిడ్చు

కొన్నాడు శీతారామయ్య. ఆ శీతారామయ్యే వాళ్లింటిదగ్గర ఓసారి జీతగాడ్ని రాచుకొని తిరిగిందన్న కారణంగా పెళ్ళాన్ని గొడ్డును బాదినట్టు బాదేడు !

బస్సు కండక్టరు "మిన్నాలే పోంగో" గొడవకు తట్టుకో లేక శీతారామయ్య అట్లా అట్లా జరిగి ముందు సీట్లోకిపోయి కూర్చొన్నాడు.

అతనిపక్కనే ఫుల్ సూటులోవున్న ఓ వ్యక్తి శీతారామయ్యను పరీక్షగా చూడ్డం మొదలెట్టాడు. శీతారామయ్య దృష్టి ఎదురుగా వున్న ఫోటోపై పడింది. అది పోలీసు శాఖ వాళ్లు ప్రకటించిన జేబుదొంగల తాలూకూ ఫోటో చూసిన దాన్ని చూసినట్టు వదిలేరకం మనిషికాదు శీతారామయ్య. అదేదో సగం అర్థమయీ కాకుండావుంది. పక్కనే కూర్చున్నా యన్ని పచ్చి తెలుగులోనే అడిగేశాడు.

"ఏమబ్బా! వాళ్ళంతా దొంగముండవాళ్లు! జేబులుదా కత్తిరిస్తురూ? నీవుదా నిండా భద్రమా వుండుమీ!" అని పక్కవ్యక్తి వచ్చీరాని తెలుగులో మొదలు పెట్టాడు.

శీతారామయ్య పక్క జేబులో వున్న పర్సును ఓసారి తడివి చూసుకొని మళ్ళీ అతని మాటల ధోరణిలో మునిగి పోయాడు. మద్రాసులో తనేమేమీ చూసింది, యింకా ఏం చూడాలనుకొంటున్నాడో ఏకరువుపెట్టి అతనికి చెప్పడం సాగించాడు.

ఇంతలో బస్సు సెంట్రల్‌లో ఆగింది. శీతారామయ్య పక్కన కూచొన్న వ్యక్తి, యింకా నలుగురైదుగురు దిగి పోయారు. శీతారామయ్య దృష్టి దొంగవాళ్ళ ఫోటోవైపు పడింది. పక్క జేబుదగ్గరకు అతనిచేయి అనుకోకుండానే

పోయింది. గుండెలు ఠార్ మన్నాయి! రెండు జేబులు ఆత్రంగా తడివి చూసుకున్నాడు. ఇంకెక్కడ పర్సు! అమ్మ బాబోయ్! మణిబాక్సు పోయింది!

"నాయాల డబ్బు కొట్టేశాడు!" కదులుతూన్న బస్సు లోంచి ఒక్క దూకు దూకాడు శీతారామయ్య. సెంట్రలూ, మూరు మార్కెటూ కలగా పులగంగా తిరిగి, కనిపించిన వాళ్ళకు తనగోడు చెప్పుకుంటూ పారిసు కార్నర్ కుచేరాడు. పర్సు కొట్టేసినవాడు యింకా తనకు కనపడతాడనే ఆశ పాపం!

శీతారామయ్య హైకోర్టుముందుకు చేరుకునేసరికి అతని చుట్టూ ఓ పదిమందిచేరి తలోవిధంగా అడగడం సాగించారు పర్సుపోయిన వివరాల్నిగురించి. వాళ్లు అడుగుతూన్నది తెలి యక బిక్కచచ్చి నుంచొన్నాడు శీతారామయ్య.

అందులో ఒకడు "నమ్మల్ది తెలుగుదా! చెప్పమీ! యీాయనకు తెలిసి పూడ్సుమా! ఎక్కడదా వుంచితివీ పర్సా!" అని అడిగాడు.

శీతారామయ్య కళ్లు పెద్దవి చేసుకోని ఖాళీజేబు చూపిం చాడు.

"అడా! ముట్టాలీతనం! అక్కడదా ఎప్పిడీ పెట్టివి? ఇక్కడ వుండేదిదా దొంగపిల్లకాయలూ!"

"ఏ బస్సులో పూడిస్తివీ?" ఇంకొకడు అడిగాడు.

"ఓస్! నీదంతా వోగోల. ఎవడో డబ్బు కొట్టేస్తే యిడిసి పెట్టానంటావ్?" శీతారామయ్య విసుగ్గా కసురుకొన్నాడు.

"అమాప్పా! ఏ బస్సులో పోతివీ?" మళ్ళీ అడిగాడు ఆ అరవ తెలుగాయన బస్సు నంబరు తెలిస్తే దొంగ దొరికే ట్టుగా?

శీతారామయ్యకు బస్సు సంగతి ఎత్తగానే బస్సులో పారేసుకొన్న డబ్బుసంగతి అటుంచి బస్సులో వదిలేసిన భార్య సంగతి గుర్తొచ్చింది. ఇక ఏడుపే తక్కువ. అచ్చమ్మ ఏమై పోయిందో ఏమో?

రెండో బస్సులో కోడంబాకం వెళ్దామంటే కానీకూడా లేదే?

తెలుగువాళ్ళలా వున్నవాళ్ళతో ఆ సంగతి చెప్పుకొని కొద్దిగా సహాయం చేయమని అడిగాడు.

అంతే డబ్బు అడిగాడో లేదో ఎక్కడివాళ్ళక్కడకు దూసుకుపోయారు.

"పోడా దొంగపిల్లకాయ! నీమాదిరీ ఎత్తినో పేరు సూస్తిని! సుమ్మ పర్సుపోయిందని దుడ్డు అడుగుతురు!" అని శీతారామయ్య ముఖానే అనేసి, అంతవరకూ అప్తుడుగావున్న అతగాడుకూడా వెళ్ళిపోయాడు.

ఆ రోజు శీతారామయ్యపడ్డ అవస్త చెప్పుకొంటే తీరేది కాదు. మూడోవంతు తెలుగువాళ్ళున్న ఆ పట్టణంలో శీతా రామయ్య ఒక మాటకు నోచుకోలేదు. 'నా' అనే మనిషి కరువై పోయాడు.

ఎలాగో కన్నయ్యశెట్టి సత్రందగ్గరకు వెళ్ళి ముసలమ్మ చేతినున్న మురుగులు తీసికొని సగానికి సగం ధరకు చైనా బజారులో అమ్ముకొని పెళ్ళాన్ని వెతికేపనిలో వూరంతా గాలించాడు. రాత్రి పదిగంటలుదాకా తిరిగినా అచ్చమ్మ జాడ తెలియలేదు. కూవం రివర్ దగ్గరి కొచ్చేసరికి శీతారామయ్యకు అందులో దూకి చద్దామనిపించింది! సత్రంలో ఎదురుచూస్తున్న ముసలితల్లి, కొడుకూ గుర్తొచ్చి యింటికి వెళ్ళాడు.

భార్యనుగురించిన వూహాలు పరిపరి విధాలుగా పోయినై శీతారామయ్య బుర్రలో. ఏమైపోయిందో ఏమో? ఆడది అందులో వంటరిగా యీ పట్టణంలో? అలా ఆలోచించుకుంటూంటే శీతారామయ్యా గుండెలు బరువెక్కిపోయినై.

ఆ రాత్రి పెళ్లాన్ని తలుచుకొంటూ శీతారామయ్య, మద్రాసునీ మద్రాసులో వున్న జనాన్నీ ఎన్ని శాపనార్థాలు పెట్టాడో మరి!

తెల్లవారి వుదయాన్నే అచ్చమ్మ సత్రందగ్గరికి తిరిగొచ్చింది. పెళ్ళాన్ని చూడగనే శీతారామయ్యకు ప్రాణం లేచి వచ్చింది! భర్తను చుట్టుకొని బావురుమని ఏడ్చింది అచ్చమ్మ! గతరాత్రి తనకు జరిగిందంతా ఏకరువు పెట్టి చెప్పింది అచ్చమ్మ. అందులో శీతారామయ్యకు ఎంతవరకు నమ్మాలో అర్థం కాలేదు!

ఛూత్! ఇక్కడ ఓ క్షణంకూడా వుండకూడదని శీతారామయ్య కుటుంబంతోసహా యక్స్‌ప్రెస్‌లో యింటికిప్రయాణమైనాడు.

శీతారామయ్యా వాళ్ళూరు పోగానే ముందు "మద్రాసు మనదే సంఘం" వాళ్ళ ఆఫీసుకుపోయి, ఆఫీసుముందు పెట్టి వున్న తడికను—ఆ రోజు తను భుజానేసుకొని తిరిగిన తడికను—ఎత్తుకుపోయి వూరుబైట నల్లచెర్లో పారేస్తూ యిలా అనుకొన్నాడు. యధవ నాయాల మద్రాసు! ఎవురిక్కావల హేస్!"